## క్లుప్తంగా

### రైతుల సంక్షేమమే ధ్యేయం


కొప్పుల లక్ష్మి

రేగోడ్(మెదక్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్‌గా ఎంపికైన కొప్పుల లక్ష్మి అన్నారు. మార్కెట్ కమిటీ ఎంపిక జీఓ విడుదలైన సందర్భంగా ఆమె సోమవారం మాట్లాడారు. తన సేవలను గుర్తించినందుకు మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

### పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి: నర్సింలు

పాపన్నపేట(మెదక్): ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని టీజీసీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు విజ్ఞప్తి చేశారు. పాపన్నపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

### పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజిరెడ్డి

నర్సాపూర్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు కొండామురళి రాసిన పుస్తకాన్ని సోమవారం కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో సీఎం రేవంత్‌రెడ్డి కృషి, నాయకత్వం, పట్టుదల ఆయన విజయానికి ఎంత ప్రధానమైనవో వివరించానని చెప్పారు.

### క్యాన్సర్‌పై అవగాహన

చేగుంట(తూప్రాన్): లయన్స్ క్లబ్ చేగుంట శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లయన్స్ పీఎంజెఫ్ జిల్లా కార్యదర్శి రమాదేవి క్యాన్సర్‌పై అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు.కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు, పీహెచ్‌ఓ యాదగిరిరావు, చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, లయన్స్ రామచంద్రం, నర్సింలు, నాగరాజ్ పాల్గొన్నారు.

### అప్రంటీస్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు అప్రంటీస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో అప్రంటీస్ మేళా నిర్వహించగా పెన్నార్, గ్లాండ్‌ఫార్మా, టాంకాం, టీజీ ఆర్టీసీ, మహాలిఫ్ట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై విద్యార్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక ఐటీఐ ప్రిన్సిపాల్ కనకయ్య, పలు కంపెనీల ప్రనిధులు , విద్యార్థులు పాల్గొన్నారు.

### కాశీకి శివలింగాల తరలింపు



వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో సంఘమేశ్వర స్వామి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో 70 వేలు శివలింగాలను తయారు చేశారు. వాటికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో శివలింగాలను కాశీ క్షేత్రానికి తరలించారు.

# కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

• బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కౌడిపల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి, ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజునాయక్, మాజీ సర్పంచ్‌లు ఎల్లం, చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు మహిపాల్ రెడ్డి, శ్యాంసుదర్‌రావు, కిషోర్‌గౌడ్, అమర్‌సింగ్, నవీన్, రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): రైతు వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. మండల కేంద్రం శివ్వంపేటలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుబంధు, రైతుభరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం తూప్రాన్ - నర్సాపూర్ హైవేపై రాస్తారోకో చేసి సీఎం దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు హరికృష్ణ, మహేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కౌడిపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హామీలను నెరవేర్చడంలో విఫలం

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్తా ఆరోపించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ శ్రేణులు మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ రాస్తారోకో చేసి, రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మాజీ సీడీసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సంతోష్ రావు, తదితరులు పాల్గొన్నారు.


కొల్చారం(నర్సాపూర్): సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

### ట్రిపుల్ ఆర్ భూముల రీసర్వే


కొంతన్‌పల్లి రీ సర్వే చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి కొంతన్‌పల్లిలో ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి భూములను సోమవారం రెవెన్యూ సిబ్బంది రీ సర్వే చేశారు. గ్రామ పరిధిలోని లోపల సర్వేనంబర్లకు సంబంధించి భూముల్లో వ్యత్యాసం ఉందని నర్సాపూర్ ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డికి రైతులు విన్నపించడంతో రీ సర్వే చేయించారు. 30 మంది రైతులకు సంబంధించి పొజిషిన్, సర్వే నంబర్లలో వ్యత్యాసం ఉండడంతో సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులుకు భూమికి బదులు భూమి, లేదంటే బహిరంగా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సునీల్, సర్వేయర్ బాసంపల్లి అనురాధ, తదితరులు ఉన్నారు.

# మీ త్యాగం అజరామరం

• స్మారక స్తూపం వద్ద పాపన్నపేట పోలీసుల నివాళి

పాపన్నపేట(మెదక్): అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం పాపన్నపేటలోని స్మారక స్తూపం వద్ద సోమవారం పోలీసులు నివాళులర్పించారు. 13 సెప్టెంబర్ 1999న నక్సల్స్ దాడిలో మరణించిన ఐదుగురు పోలీసుల ఫొటోలకు పూలమాలలు వేసి, మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వారి మరణం బాధిత కుటుంబాలకు తీరని లోటన్నారు. ప్రజల కోసం నిరంతర విధులు నిర్వర్తిస్తూ అమరులైన పోలీసుల త్యాగం అజరామరం అన్నారు. భావి తరాలకు వారి త్యాగం స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బస్వరాజు, ప్రవీణ్, నర్సింలు, కృష్ణ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.


పాపన్నపేట(మెదక్): అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు


తూప్రాన్‌లో..

పోలీసుల సేవలు మరవలేనివి: డీఎస్పీ

తూప్రాన్: పోలీసుల అమర వీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ చౌరస్తాలో దివగంత డీఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందించేందుకు విధి నిర్వహణలో ప్రాణాలను పోగొట్టుకున్న పోలీసుల సేవలు మరవలేనివి అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ నృత్యకారిణిగా కుశలగౌరీ


బహుమతిని అందుకుంటున్న చిన్నారి

టేక్మాల్(మెదక్): అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని కుసంగి గ్రామానికి చెందిన చిన్నారి కులశగౌరీ ఉత్తమ ప్రతిభను చూపింది. దీంతో ఆమె ఉత్తమ నృత్యకారిణిగా ఎన్నికకావడంతో సోమవారం చిన్నారితో పాటూ ఆమె తల్లిదండ్రులు మల్లికార్జునగౌడ్, మధులతకు అవార్డులను అందించారు. అవార్డుల కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు, మాజీ ఎంపీ వేణుగోపాలచారి పాల్గొన్నారు.

### రైతు శిక్షణకు తరలిన మహిళలు


తునికి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన చేగుంట మండల మహిళా రైతులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మహిళా రైతులకు సెహల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా కంది, వరి, మొక్కజొన్న ఎరువులు యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యలు, కూరగాయల సాగుపై శాస్త్రవేత్తలు రవి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌లు మహిళా రైతులకు వివరించారు. కూరగాయల పంటల సాగు, బిందుసేద్యంపై మహిపాల్‌రెడ్డి వివరించారు. పంటల మార్పిడి పాటిస్తే, అధిక లాభాలు సాధించేలా చేపట్టాల్సిన వ్యవసాయ పనులను గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం లీడ్ వాణి, శ్రవణ్, విజయ్, యాదగిరి, అవినాశ్ ఉన్నారు.

### నేటి తరం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే

మెదక్ కలెక్టరేట్: నేటి తరం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దేనని ఆర్‌ఎస్‌ఎల్ కంపెనీ డైరెక్టర్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ కంప్యూటర్ సైన్స్ విభాగం, ఆర్‌ఎస్‌ఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ టెక్నాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. హుస్సేన్, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ - కంప్యూటర్ విభాగ అధిపతి డా. తిరుమల్‌రెడ్డి, డా.శరత్‌రెడ్డి, చంద్రశేఖర్, వామనమూర్తి, వేణుగోపాల్ శర్మ, కాశీ విశ్వనాథ్, చంద్రశేఖర్, నిదర్శిని, నరేష్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ కమిటీలపై బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రాద్ధాంతం చేయడం సరికాదని పారదర్శకంగా కమిటీలు వేశామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం రాత్రి కౌడిపల్లి మండలం ధర్మాసాగర్ గేట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. ప్రజాపాలన ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నమని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు కమిటీల్లో ఎంత మంది కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇచ్చారో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రఘు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీను, కృష్ణ, మల్లేశ్, సత్యనారాయణ, రాజు, పోచాగౌడ్, రాములు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# ఎమ్మెల్సీగా మహేందర్‌రెడ్డిని గెలిపించండి

• పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ


ఓటరు నమోదు పత్రాలతో పీఆర్‌టీయూ నేతలు

మెదక్‌జోన్: కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అధికార అభ్యర్థి మహేందర్‌రెడ్డిని ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ కోరారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, గురుకుల పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ గణపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులకు సన్మానం


చండూర్‌లో నూతన ఉపాధ్యాయులను సన్మానించిన పీఆర్‌టీయూ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఉన్న పలు పాఠశాలల్లో విధుల్లోకి చేరిన నూతన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ విఠల్, చిలప్‌చెడ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వేదశ్రీ, చండూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిసింగ్ ముఖ్య అతిథులుగా హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృతి అనేది ఎంతో గొప్పదని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే అరుదైనదన్నారు. ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శర్వన్, జిల్లా క్యాదర్శి ధన్‌సింగ్, మండల గౌరవ అధ్యక్షుడు మురళి, అసోసియేట్ అధ్యక్షుడు విజయ్, నాయకులు వాణిదేవి, నర్సింలు, శిధర్, అనిల్, సీఆర్‌పీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు


చేగుంట(తూప్రాన్): ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం లతంబర్‌రావు


పాపన్నపేట(మెదక్): అవార్డులను అందుకుంటున్న ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లతాంబర్ రావు సోమవారం ఎక్స్‌లెన్స్ టీచర్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అవార్డును అందించినట్లు చెప్పారు.

పాపన్నపేట(మెదక్): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మండలానికి చెందిన ఇద్దరు టీచర్లకు అవార్డులు అందజేశారు. స్కైలైఫ్ ఫౌండేషన్, శారద ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థల ప్రతినిధులు చీకోడ్– లింగాయపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కిషన్ ప్రసాద్, విఠల్‌లను ఎక్స్‌లెన్స్ అవార్డులతో సన్మానించారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

పాపన్నపేట(మెదక్): విద్యార్థుల్లో స్థాయికి తగ్గ నైపుణ్యాలు పెంపొందించాలని మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షల నిర్వాహణను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు వచ్చేలా చూడాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని కోరారు. ఇటీవల నియమితులైన స్కావెంజర్లతో మాట్లాడి వారి విధులను తెలియజేశారు. ఆయన వెంట హెచ్‌ఎం ఆకుల రాంకిషన్, టీచర్లు అశోక్ కుమార్, శ్రీనివాస్, నర్సింలు ఉన్నారు.


నాగ్సాన్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల పరీక్ష పత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి

# వ్యాపారం పెంచేందుకు సెమి అర్బన్‌పై దృష్టి

నర్సాపూర్: సెమి అర్బన్ ఏరియాల్లో కెనరా బ్యాంకు శాఖలు పెంచి వ్యాపారం పెంచేందుకు దృష్టి పెట్టామని కెనరా బ్యాంకు హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర అన్నారు. నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు శాఖను ప్రముఖ సామాజిక కార్యకర్త పద్మశ్రీ డా. హన్మంతరావు, బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం చీఫ్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సర్కిల్ పరిధిలో 361 శాఖలు ఉన్నాయని, సర్కిల్‌లో ఒకలక్ష ఎనిమిది వేల కోట్ల వ్యాపారం తమ బ్యాంకుల ద్వారా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త పద్మశ్రీ డా.హనుమంతరావు, నిజామాబాద్ రీజనల్ ఏజీఎం శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్‌రెడ్డి, నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేందర్ రావు, ఆయా పార్టీల నాయకులు మురళీయాదవ్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, హైడ్రా పేరుతో దౌర్జన్యాలను ఆపాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. సోమవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, బసవరాజు, నర్సమ్మ, మహేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ పాఠశాలలో చోరీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రహరీని ధ్వంసం చేయడం, తరగతి, కార్యాలయం గదుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న 18 లీటర్ల వంటనూనె, పప్పులు తాగునీటికి ఉపయోగించే నల్లాలు తదితర వస్తువులు సుమారురూ. 20 వేల విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎం సుమంగళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

◆ అంతిమ యాత్ర వాహనం అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో చీర్ల భాస్కర్‌యాదవ్ తన తాత కేశబోయిన అంజయ్యయాదవ్ స్మారకార్థం గ్రామ పంచాయతీ కార్యాలయానికి అంతిమయాత్ర(వైకుంఠ రథం) వాహనం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎలక్షన్‌రెడ్డి, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యకి మృతి



చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స గాంధీ ఆస్పత్రిలో పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 7న చేగుంట రైల్వే గేటు సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

◆ పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.హుస్సేన్ తెలిపారు. సోమవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గణపతి, మల్లేశం, సురేందర్‌రావు, వెంకటేశ్వర్లు, రాజాగౌడ్, దేవదాస్, నాగరాజు పాల్గొన్నారు.

◆ గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో అస్వస్థతకు గురైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఏడుపాయలలోని హరిత హోటల్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి(70) ఆదివారం పడిపోయాడు. దీంతో అతన్ని వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ..ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్సై చెప్పారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 57920కు ఫోన్ చేయాలని కోరారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ సబ్జెక్టులో అతిథి అధ్యాపక పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.హుస్సేన్ సోమవారం తెలిపారు.

# దళారులకు ధాన్యం విక్రయించొద్దు


మాసాయిపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): దళారులకు ధాన్యం విక్రయించొద్దని, ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తూ ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని నాగ్సాన్‌పల్లి, బొమ్మారం, వెల్దుర్తి, చెర్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మాసాయిపేట కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపీడీఓ రాజు, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, ఏకేపీ ఏపీఎం శంకరయ్య, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రుద్రారం గ్రామంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఓ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, గ్రామ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, ఆయా గ్రామాల పీఏసీఎస్ చైర్మన్‌లు నాగయ్య, శ్రీనివాస్, కృపాకర్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సంతోష్, వేమారెడ్డి, కాశీనాథ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.


చిన్నశంకరంపేట(మెదక్): రుద్రారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఓ లక్ష్మీనారాయణ